వరంగల్‌లో భారీ అగ్నిప్రమాదం

మంటల్లో ఫర్నిచర్ షాపు దహనం

దశ వరంగల్ : వరంగల్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే జె.పి.ఎన్ రోడ్ లో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక దత్తాత్రేయ ఫర్నిచర్ షాపులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. దత్తాత్రేయ ఫర్నిచర్ షోరూమ్ షాపులో ఫర్నిచర్ (చెక్క సామాగ్రి) ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేశాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన మంత్రి

దశ వరంగల్: మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని సాయి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలు మరియు ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , జి డబ్ల్యూ ఎం సి నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒకప్పుడు మహిళలను వంటింటికే పరిమితం చేసేవారని, కానీ నేడు ప్రపంచ ప్రగతికి మహిళలు రథచక్రాలుగా మారారని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందుకు తానే ఒక ఉదాహరణనని మంత్రి సురేఖ తెలిపారు. ఒక మహిళగా తనకు ప్రజాప్రతినిధిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవ చేసే అవకాశం రావడం మహిళల ఎదుగుదలకు నిదర్శనమని అన్నారు.

మహిళల సంక్షేమం కోసం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి సురేఖ తెలిపారు. గతంలో మహిళా సంఘాలు అంటే స్వయం ఉపాధి మాత్రమే ఉండేదని, కానీ ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలు పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నాయని అన్నారు. మహిళలను మహాలక్ష్మిగా గౌరవించడం మన సంస్కృతిలో భాగమని తెలిపారు. అందుకే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. దీంతో మహిళలు ఆదా చేసుకున్న డబ్బును ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు.

ఇప్పటివరకు కోట్లాది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. మహిళలు కేవలం కుట్లు, అల్లికలకు మాత్రమే పరిమితం కాదని, వారు సంపద సృష్టికర్తలని మంత్రి సురేఖ అన్నారు. దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 వరకు ఉంటే, తెలంగాణలో రూ.500కే అందిస్తున్నామని తెలిపారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ మహిళలపై ఆర్థిక భారం తగ్గిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు సోదరుడిలా అండగా నిలుస్తూ ప్రజాపాలన అందిస్తున్నారని మంత్రి సురేఖ తెలిపారు. మహిళలు ఏ వ్యాపారం ప్రారంభించినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తి సమాన పనికి సమాన వేతనం అనే నినాదమని, లింగ వివక్షత లేకుండా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రానున్న రోజుల్లో మహిళల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎంపీ కావ్య

హన్మకొండ జిల్లా దిశా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

దశ హనుమకొండ: హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియంకావ్యఅధ్యక్షతనఏర్పాటుహన్మకొండ జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశా కమిటీ సమావేశానికి శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ , ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి , గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. తొలుత దిశా సమావేశానికి విచ్చే సిన ఎమ్మెల్యే నాగరాజు కు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బాలికలకు వేసే హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమం, అదేవిధంగా టీజీ రెడ్కో ఆధ్వర్యంలో తయారుచేసిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకానికి సంబంధించిన పోస్టర్లను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సోలార్ సదుపాయాన్ని కల్పించాలని, ఆ దిశగా అధికారుల చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాఠశాలల్లో హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని అన్నారు. సిపిఆర్ పై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల స్థాయిలో హార్ట్ ఎటాక్ లు వస్తున్న దృష్ట్యా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. మడికొండ డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉందని, అదేవిధంగా హసన్ పర్తి టౌన్ లో తాగునీటి సమస్య ఉందని వాటికి పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సంబంధిత అధికారులకు సూచించారు. హసన్ పర్తి, బొల్లికుంట మార్గాలలో రోడ్డు ప్రమాదాల కారణంగా విద్యార్థులు యువత మరణిస్తున్నారని, చాలా బాధేస్తుందని అన్నారు. ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, దిశా కమిటీ సభ్యులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు...

ఘనంగా స్వపరి పాలనదినోత్సవం వేడుకలు

దశ తుంగతుర్తి: తుంగతుర్తి మండలం వెంపటి ప్రాథమిక పాఠశాలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణతో పాత్రలు పోషించి పలువురిని ఆకట్టుకున్నారు.విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామనరసమ్మ మాట్లాడుతూ ...విద్యార్థులకు నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత వంటి విలువలను చిన్నప్పటి నుంచి అలవాటు చేసుకోవాలని సూచించారు,చిన్నప్పటినుంచి సమాజంలోని వివిధ బాధ్యతల గురించి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారని, విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు,ఉపాధ్యాయుల పాత్రలను స్వీకరించి నిర్వహించడం చాలా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీవనపల్లి శ్రీనివాస్,మల్లెపాక రవీందర్,గట్టు మాధవి,బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రం, మాలోతుకృష్ణ, గుండ్ల ఆంజనేయులు,రామణ బోయిన మౌనిక, పంజాల మంజుల, గోరోజు రమాదేవి లు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో యువత ముందుండాలి: గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



దశ ఓయూ: విపత్తుల సమయంలో సమాజానికి సేవ చేయడంలో యువత ముందుండాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం టాగోర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వ యువ ఆపద మిత్ర పథకం కింద రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ సంస్థ రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) విభాగంతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి వాలంటీర్లను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, ఆపద మిత్ర కార్యక్రమం ద్వారా యువతను సమాజ సేవకు సిద్ధం చేయడం అభినందనీయమని తెలిపారు. సంక్షోభ సమయంలోసేవ చేసేందుకుయువతసిద్ధంగా ఉండటం దేశానికినిజమైనబలం అనిఆయన పేర్కొన్నారు.జాతీయసేవాపథకం (ఎన్ఎస్ఎస్)వాలంటీర్లనుఆపదమిత్రులుగాతీర్చిదిద్దడం ద్వారా గ్రామస్థాయి వరకు విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతున్నామని చెప్పారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని గవర్నర్ అన్నారు. స్వచ్ఛంద సేవా భావాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు.

హన్మకొండ జిల్లా బీసీ మహిళా అధ్యక్షురాలిగా సంధ్యారాణి

దశ హనుమకొండ: తెలంగాణ బీసీ ప్రజా సంఘం హన్మకొండ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బాసాని సంధ్యారాణి ని ఈరోజు తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నాయిని భరత్ నియమించారు . హన్మకొండ జిల్లా బీసీ మహిళా కార్యకర్తల సమావేశం లో సంధ్యారాణి ని నియమించి ఆమెకు నియామక పత్రం అందజేశారు . కార్యక్రమంలో సీనియర్ బీసీ నాయకురాలు తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర మహిళా ఇంచార్జి డాక్టర్ లయన్ పద్మజ దేవి . మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లేష్. వరంగల్ నగర యూత్ అధ్యకులు రవి సాగర్ , బీసీ జిల్లా మడిశెట్టి అరుంధతి, సంధ్యా రాణి , హైమ మరియు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

దేహ దానంతో వైద్య విద్యార్థులకు వైద్య విద్య బోధన

దశ వరంగల్: వరంగల్ జిల్లా, ఉప్పరపల్లి నివాసి రాయపురం ఎల్లమ్మ 70 శనివారం రోజు మృతి చెందారు.వారి కుటుంబ సభ్యులు మేనల్లుళ్ళు పులి చేరు ఎల్లస్వామి, శ్రీనివాస్, రమేష్, వేణు, మహేష్, ఎల్లస్వామి సహకారంతో వారి కోరిక మేరకు సమాజ హితం కోరి, తన దేహాన్ని వైద్య విద్యా నిమిత్తం, కాకతీయ మెడికల్ కాలేజీ వరంగల్ కి తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో దేహ దానం చేసారు.కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ శశికాంత, అనాటమీ విద్యార్థులు , సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ పార్థివ దేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే.మల్లారెడ్డి మాట్లాడుతూ, సామాన్య జీవితం గడిపి, మరణిస్తూ కూడా మెడికల్ కాలేజీకి దానం చేసి భావి వైద్యుల వైద్య విద్యకు, శాస్త్ర పరిశోధనకు, సర్జరీకి ఉపయోగపడినది అని అన్నారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపి, నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పెండ్లి ఉపేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, బంధుమిత్రులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వార్డు ప్రజల అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే మా లక్ష్యం

33 వ వార్డు లో ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక

కార్యక్రమాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ నాగుల శ్రీనివాస్.

దశ సూర్యాపేట ప్రతినిధి: మున్సిపాలిటీల అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రూపొందించిన ప్రజాపాలన ప్రగతిప్రణాళి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 33 వ వార్డు కౌన్సిలర్ నాగుల శ్రీనివాస్ అన్నారు. శనివారం 99 రోజుల కార్యక్రమాన్ని ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్ లో మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించి ప్రజాపాలనప్రగతిప్రణాళిక కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని సూచించారు. వార్డులో నెలకొన్న మౌలిక సమస్యలైన పారిశుద్ధ్యం, కాలువల పరిశుభ్రత, నల్లా కనెక్షన్ల పునరుద్దీకరణ, ప్రజలకు ఇబ్బందిగా ఉన్న చెట్లు, మొక్కలు తొలగించుట తదితర సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వార్డు ఇన్చార్జ్, పారిశుధ్య సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.